# దైవం మనుష్యరూపేణాం

"...ఎంత సెలవు లైతే మాత్రంః ఇంక లేవోయ్ పుల్లయ్యా. ఇది మూడోసారి నీ కాఫీ వేడిచేయడం" బద్ధకంగా అటు తిరిగి పడుకోబోతున్న నన్ను బుజం పట్టుకొని కుదిపేస్తోంది మా ఆవిడ. నేను సగం నిద్ర నటిస్తూ ఆమెని నామీదకు లాక్కోబోయాను, "ష్‌ష్, పనుంది! ఈ కాఫీ తాగు, నన్ను చూస్తూ!" అని కాఫీ గ్లాసు అందించింది. కాఫీ ఘుమ ఘుమ లాడుతోంది - మా ఆవిడలాగే. కూచుని తాగుతున్నాను. శారద నా చెయ్యి నేర్పుగా విడిపించుకుని పుస్తకాల షెల్ఫుల వైపు పారిపోయింది.

శారదని వెనకనించి అలా చూసేసరికి నా వయసు తారెత్తి పదేళ్లు వెనక్కిపోయింది. ఎందుకంటే శారద ఇప్పుడు స్పెషల్ డ్రెస్‌లో ఉంది. అది అక్కడక్కడ చిరిగిన పాత పసుపు పచ్చ పువ్వుల చీర; చేతులులేని తెల్ల జాకెట్, పైగా అంట్ల గిన్నెలు తోమే పనిమనిషి స్టయిల్ లో మోకాళ్ల తొడలు కనపడేలా చీరఅంచుల్ని బొడ్లోదోపి చెంగు నడుం చుట్టూ బిగించింది. దాంతో అసలే చేరెడేసి ఉన్న ఆ చీర చిరుగుల అందం పదింతలైంది. జడవదులుగా ఉండి పిరుదుల మీద ఆడుతోంది. శారద పుస్తకాల షెల్ఫ్ దగ్గర చిన్న స్టూలుమీద నిలుచుని పుస్తకాల్ని దుమ్ము దులిపి కొన్నింటిని క్రిందికి విసిరేస్తూ దుమ్ము సర్దుతూంటే "నా ఎదుట నీవు - నీ ఎదుట - సారీ- నీ వెనుక నేనూ" అని పాడుతూ కాఫీ తాగుతుంటే ఆస్పత్రి డ్యూటీ లేని రోజులే కదా డాక్టరుకి స్వర్గం అనిపించింది. కళ్ళు రెండూ శారద అనాటమీ, ఫిజియాలజీ స్టడీ చేస్తున్నాయి. ఎటొచ్చీ పేరుపడ్డ రచయిత నవలని "ప్రచురించడానికి, పనికొస్తుందా" అని "జాగ్రత్త"గా పరిశీలిస్తున్న ఎడిటర్ మనస్సులా ఆ కళ్ళు కేవలం ఆనందాన్నే అనుభవిస్తున్నాయి; "మెడికో"లా శ్రమపడటం లేదు.

ఎంత హాయిగా వుందో!

నేను ఈఊళ్ళో త్వరగా పేరొచ్చిన డాక్టర్ని. డబ్బులు బాగా వచ్చాయి పదేళ్ళ ప్రాక్టీసుతో. ఓకారు, పెద్ద కాంపౌండులో ఉన్న ఇల్లూ కొన్నాను; ఇరవై పడకలున్నాయి నాసొంత ఆస్పత్రిలో. నాకు మెడికల్ డిగ్రీలే కాకుండా తెలివైన పెళ్ళాం (డాॱశారద. ఎమ్మెస్సీ ఆనర్స్. హస్‌బెండ్ స్పెషలిస్ట్) సహాయం కూడా వుంటాన ఏడాదికో నెల నా ఆస్పత్రికి సెలవు పెట్టేసి నా ఫ్రెండ్స్ డాక్టర్ రెడ్డి, వెంకటనారాయణల చేతుల్లో పెట్టి హాయిగా విశ్రాంతి

తీసుకుంటాను. ఈవేళ నావెకేషన్ లో పదహారోరోజు. ఇంక రెండు వారాల్దాకా నేను ఆస్పత్రి మొహం చూడను.

శారద ముఖం కిటికీలోంచి వస్తున్న ఎండలో చిరు చెమటలు పట్టి మెరుస్తోంది. ఆ ఎండే, ఆమె తొడల అందాన్ని అసలే చిరిగిన చీరలోంచి ఎక్స్‌రే కళ్ళతో చూపిస్తూ, "అబ్బో మీ ఆవిడ చాలా అందమైంది డాక్టర్. ఈ దృశ్యం నీ ఆరోగ్యానికి చాలా మంచిది. నీ కళ్ళు చాలా పుణ్యం చేసుకు పుట్టాయి" అని నన్ను ఉబ్బేస్తోంది. పరాయి ఆడదాన్ని చూస్తున్నాడని సూర్యుణ్ణి నేను తప్పు పట్టకుండా చేయాలని. నా కళ్ళు గంతు లేస్తున్నాయి.

"శారదా నీ వరస నా కేమీ నచ్చలేదు. నిలకడగా ఒకక్షణం నిలబడవు. పుస్తకాలు సర్దేవంకతో డాన్స్ చేస్తోంది నీ ఒళ్ళు, దాంతో నా కళ్ళకి కాలు నిలవడం లేదు. వాటికి అసలే బుద్ధి లేదు" అన్నాను సిగరెట్ వెలిగిస్తూ.

"కళ్ళకి నిలకడ ఎక్కువైతే రోగం వస్తుందోయ్ డాక్టర్ కత్తుల రత్తయ్యా, నిలకడగా వుండాల్సింది బుద్ధి, కళ్ళు కాదు" అని వెక్కిరించింది శారద.

అప్పుడు మా నిశ్శబ్దాన్ని చెదర గొడుతూ కాలింగ్ బెల్ మోగింది. "ఎవరో..... కొంపతీసి పేషంటేమో. ఏదో చెప్పి తోలేయ్" అన్నాను. "ఇంకా నయం! నేన్నీ పెళ్ళాన్ని డాక్టర్, రిసెప్షనిస్టుని కాదు; మినీస్కర్టు కిందికి లాక్కుంటూ అందర్నీ ఆహ్వానించడానికి! నువ్వే వెళ్ళు." అంది శారద, బ్యూటీ స్పెషలిస్టు.

గ్లాసులో మిగిలిన కాఫీ తాగేసి కళ్ళు నులుపుకుంటూ వెళ్ళాను వీధిగుమ్మంవేపు అప్పటికే మా పిల్లలు వచ్చినతన్ని లోనికి ఆహ్వానిస్తున్నారు. నాక్కొంచెం తెలిసినవాడే అతను. సుందర్రావు కాబోలు పేరు. కాలేజీలో మేష్టారు. అతన్ని రెండుమూడుసార్లు ఏవో సభల్లో మాట్లాడుతుంటే చూశాను.

"ఫరవాలేదు. పేషెంట్ కాదు" అని తేలిగ్గా ఊపిరి పీల్చుకుని. "రండి మేష్టారూ, ఇప్పుడే నిద్రలేచాను. ఇలా కూర్చోండి. నేను ఫైవ్ మినిట్స్‌లో వచ్చేస్తాను. ఈ మేగజైన్ను చూస్తుండండి. ఇందులో మనోజ్‌దాస్ కథొకటి వుంది. చాలా మంది కథ" అని అతనేదో చెప్పేలోగా బాత్‌రూం వేపు వెళ్ళి పోయాను.

వళ్ళు తోముకుని ముఖం తుడుచుకుంటూ వచ్చేసరికి అతను కాఫీ నిరాకరించే కృషిలో వున్నాడు. 'ఫరవాలేదు తాగండి' అని పనిపిల్లతోబాటు మా అబ్బాయిలు ముగ్గురూ ఎంకరేజ్ చేస్తున్నా అతను ఒప్పుకోటం లేదు తపోభంగం చేస్తున్న అప్సరసని తోసిపుచ్చుతున్న విశ్వామిత్రుడిలా మొహానికి అరచెయ్యి అడ్డు పెట్టుకుని మరో చేతిని మంత్ర దండంతో ఆడిస్తూ లేచి నిలబడి "నాకు పడదండీ. అబ్బే మరేం లేదు. నా హెల్తుకి పడదు. ఇంకేమీ అబ్జెక్షన్ కాదు. నియమం కూడా కాదు. అసలు తాగను. తాగితే 'డిసెంట్రీ' వస్తుంది. కాఫీ, టీలు ఎమీబిక్ డిసెంట్రీ క్రిములకి మంచి ఇష్టం. కల్చర్ చేస్తాయి వాటిని" అని సణుగుతున్నాడు.

నేను ఒక కుర్చీలో కూర్చుని నా కాఫీ తాగుతూ "కూర్చోండి మేష్టారూ. కాఫీ తాగినా తాక్కపోయినా" అని కూర్చో పెట్టాను సుందర్రావు చాలా శ్రమపడిన వాడిలా కుర్చీలో

కూలబడి నిదానంగా ఎదుటి ఖాళీ గోడని చూడసాగాడు. అయిదు నిముషాలైనా నా వైపు తిరగ లేదు. మాట్లాడలేదు. అతని ఈ వింత ప్రవర్తన నాకు కొత్త. అతను సాహితీ ప్రియుడనీ, కాస్తో కూస్తో పండితుడనీ ఇన్నాళ్ళూ నా ఇంప్రెషన్. ఓసారి ఇంజనీరింగ్ కాలేజీ వాళ్ళు నన్ను చీఫ్ గెస్టుగా పిలిచిన సభలో అతను "మధుర భక్తి" గురించి మాట్లాడి స్టూడెంట్స్‌కి అదే పనిగా ఈలలూ, కూతలూ కూసే అవకాశం కల్పించాడు. మరోసారి ఏదో ఖండకావ్యం (డాక్టర్ల భాషలో ఏంప్యుటేటెడ్ పోయెం!) గురించిన చర్చలో పాల్గొన్నాడు. అలవాటుగా నేనప్పుడు సిగరెట్ ఆఫర్ చేస్తే "సమాజంలో నీతి, క్రమశిక్షణ నశించి పోయాయి" అని క్లుప్తంగా నన్ను అవమానించాడు.

ఇప్పుడెందుకు వచ్చాడు అని గెస్ చెయ్యబోయి వెంటనే మా ఆవిడ సూక్తి గుర్తొచ్చి (పడక గది జోక్ ఇక్కడ చెప్పకూడదు.మీలో కొందరు పెళ్లి కాని వాళ్ళుండొచ్చు.) ఎదురుగా చెట్టంత మనిషి వుండగావాణ్ణే అడక్క "ఊహిస్తాను అంటూ బుర్రపాడు చేసుకోవడమేమిటి అని మనసులో లెంపలేసుకుని "ఏమిటి యిలా వచ్చారు. కాలేజీ లేదా" అన్నాను. అతను మాట్లాడ లేదు. గోడతో ఏదో తీవ్రంగా చర్చిస్తున్నట్లున్నాడు. గోడని ప్రేయసిగా భావించడం కొందరు కవులకీ, గోడలకి స్లోగన్స్ రాసి వాటికి పాఠాలు చెప్పి చైతన్యవంతం చేయడం మరి కొందరు సామాజికవాదులకీ ఇష్టం. ఎటొచ్చీ ఈ పదేళ్ళ ప్రాక్టీసులోనూ, అలాంటి వాళ్ళెవరూ నా దగ్గర ట్రీట్‌మెంటుకి రాలేదు. 'గోడ ప్రేమ'కి నా వైద్యం పనికిరాదేమో!

మరో అయిదు నిముషాలు అతన్ని చూస్తూ సిగరెట్ కాల్చాను.

సుందర్రావుకి ముప్పై ఏళ్ళుంటాయి. కాని ఏభయి ఏళ్ళ వాడిలా వున్నాడు కళ్ళల్లో ఏదో వింత చీకటి. అనారోగ్యం ఉట్టిపడుతున్న చర్మం. అతన్ని చూస్తే మనకి నీరసం వస్తుందని గ్రహించాను.

అతనుగోడతో చాలా చర్చిస్తున్నాడు. కొంతసేపు కళ్ళప్పగించి చూడటం, తరవాత ఓ క్షణం తల దించుకుని కళ్ళు మూసుకోడం, నవ్వుకోడం, మళ్ళీ తల ఎత్తి (కళ్ల మూసుకునే) చిరునవ్వు ప్రదర్శించడం అక్కడెవరో మనిషి ఉన్నట్లూ, చాలా సన్నిహిత సంబంధం ఆ మనిషితో ఉన్నట్లూ ప్రవర్తిస్తున్నాడు.

చూడ్డానికి బాగానే వుంది. ఇదేదో వింత దృశ్యమే కాని దీని పర్యవసానం ఏమిటి? అతనికి మధుర భక్తి గట్రా నేర్పిన ఓ గురువున్నాడు. ఆ గురువుకి ఓ మఠం వుంది. ఆ మఠానికి వీళ్ళంతా డబ్బు లిస్తారు. నన్ను కూడా ఇమ్మంటాడా? నా సిగరెట్, కాఫీ పాపాలనించి విముక్తి కోసం ఆ గురువుని ఆశ్రయించమంటాడా? ఓ క్షణం ఊహించబోయి ఊరుకున్నాను.

సుందర్రావు పరవశంతో నవ్వుకుంటున్నాడు. సినిమాల్లో భక్తి నటించే హీరోయిన్ ముఖాలు గుర్తొచ్చాయి. కళ్ళు, నోరు ఊరికే బిగుసుకుపోయి తలలాడిస్తూ ఉండే ముఖాలు. వెనకాల భక్తిపాట ముందు దేవుడి బొమ్మ. అలా వుంది అతని వరస.

హఠాత్తుగా నా వేపు తిరిగి "నాకు కళ్ళు పోయాయి" అన్నాడు. జోక్ అనుకుని ఫెళఫెళా నవ్వబోతుంటే నీరసంగా "పూర్తిగా పోలేదు. అడపా తడపా పోతుంటాయి" అన్నాడు. జోక్‌కాదు, రోగమే.

"ఏమిటీ? చెప్పండి" అన్నాను.

"రోజంతా తల నొప్పి. అయినా ఆ బృందా విహారి దయవల్ల హాయిగా వుంటుందనుకోండి. మనోనేత్రం ముందు ఆయనే ఆడుతూ ఉంటాడు. కాని ఉన్నట్టుండి కళ్ళు కనపడ్డం మానేస్తుంటాయి."

"ఎలాంటప్పుడు?"

"పొద్దున్న మధ్యాహ్నం సాయంత్రం రోజా నాలుగైదు సార్లు."

"రాత్రిళ్ళు?"

"రాత్రి బాగానే వుంటుంది. ఇంటి కొచ్చేసాక తలనొప్పి వుంటుంది. కాని కళ్ళు పని చేస్తాయి."

"నిద్ర పడుతుందా?"

"యోగనిద్ర"

"అంటే!"

"కలా మెళుకువా కాని స్థితి అది. మీ కర్థం కాదు. భక్తి ఉన్నవాళ్ళకి మాత్రం అది అనుభవైక వేద్యము"

అప్పుడు శారద కూడా వచ్చి కూర్చుంది. ఇందాకటి డ్రెస్‌కి బదులు సాదాచీర (రూ॥ 450 ఖరీదు చేసేది). పొడుగు చేతుల జాకెట్ ధరించింది. బ్యాంకుకో, బజారుకో తయారవుతోందన్న మాట. శారద సుందర్రావుని చూసి నవ్వాపుకుంది. సుందర్రావు శారదని చూసి మాట్లాడ్డం ఆపేశాడు. మళ్ళీ గోడతో సంభాషణ మొదలెట్టాడు. నేను నెమ్మదిగా "నువ్వు పో" అన్నాను మా ఆవిడతో. "నా ప్లానూ అదే. ఇతను వైద్యం కోసం వస్తే మాత్రం వెంటనే పంపించేస్తాను. నువ్విప్పుడు వెకేషన్ లో ఉన్నావు" అంది.

"నేను చేయాలనుకున్నా అది జరిగే ప్రమాదం లేదు. ఇతని వరస చాలా వింతగా వుంది. రోజుకి నాలుగుసార్లు కళ్ళుపోతాయిట. భక్తి కన్ను మాత్రం నిత్యం కృష్ణుడిని చూస్తుం టుందిట."

పగలబడి నవ్వింది శారద. నేనూ నవ్వాను చిత్రం ఏమిటంటే మూడో మనిషి ఒక దక్కడ ఉన్నాడు. అతను అవమానం ఫీలవుతాడు అని కూడా అనిపించలేదు. మా ఇద్దరికీ గోడతో మాట్లాడే మనిషి గోడ క్రిందే లెఖ్ఖ!

శారద ఓ నిమిషంలో నవ్వు ఆపుకుని, "ఏ మండీ మీ ఆవిడ పేరేమిటి?" అని సుందర్రావుకి బ్రహ్మచెముడు అన్నట్లు బిగ్గరగా అడిగింది. సుందర్రావు ఉలిక్కిబడి మావేపు చూశాడు. "శ్రీ కృష్ణుడు" అని చెప్పేసి మళ్ళీ గోడని చూడసాగారు. నాకు ఆశ్చర్యంతో నవ్వు రాలేదు. శారద మాత్రం "రెస్టు తీసుకో డాక్టర్. ఈయన్ని కళ్ళ స్పెషలిస్టు ఎవరికేనా రిఫర్ చెయ్యి. మన రెడ్డిగారే ఉన్నారుగా. అక్కడికి వెళ్ళమను. నువ్వు స్నానం చేసి టి.ఎం. చేసుకో. నేను బజారుకి వెళ్ళి వచ్చేసరికి భోజనానికి రెడీగా ఉండాలి" అని లేచి కారుషెడ్ వేపు వెళ్ళి పోయింది!

సుందర్రావు మాత్రం తనొక్కడే ఈ గదిలో ఉన్నట్టు గోడతో రాచకార్యా లేవో కొనసాగిస్తున్నాడు. నేను మళ్ళీ పలకరించాను అతన్ని." ఈ సంగతి మీ భార్యకి తెలుసా?"

"ఏ సంగతి?"

"అదే మీ కళ్ళ గురించి"

"ఏ కళ్ళ సంగతి?" అన్నాడు. నా కళ్ళు చూపించాను.

"కళ్ళు ఎవరికి ఉన్నాయి! కళ్ళు ఉండే కృష్ణుణ్ణి చూసినవే కళ్ళు. ఆయన నిత్యం నా కళ్ళ ముందు ఉంటాడు."

నాకు చిరాకేసింది. ఇదేం గొడవ పొద్దున్నే- అని.

"బసవరాజు మీకు తెలుసా"

"తెలియకేం. నా ఫ్రెండే పచ్చి కమ్యూనిష్టనుకోండి."

"అతన్ని కల్సుకుని ట్రాన్సెండెంటల్ మెడిటేషన్ నేర్చుకోండి. హాయిగా వుంటుంది. నేను మూడేళ్ళ నించీ చేస్తున్నాను."

"మీకు ఏమొచ్చింది, చేస్తే? కృష్ణుడు కనిపించాడా? ఒక్కసారైనా? అదే బసవరాజుని అడిగాను - ఎంత పొగరు? ఎంత పొగరు? కృష్ణుడు అతని అభిమాన రచయిత! భగవద్గీత రాశాడని! అంతే కాని కృష్ణుడు కనపడక్కర్లేదుట మోక్షం రావాలంటే" ఒక్కొక్క వాక్యంతో సుందర్రావు కోపం లంకలో ఆంజనేయుడి తోకలా పెరిగిపోయింది.

"సర్లేండి. మీ కళ్ళ సమస్య గురించి ఆలోచిద్దాం. డాక్టర్ వీరారెడ్డి తెలుసుగా, ఐ స్పెషలిస్టు? నా ఫ్రెండ్. ప్రస్తుతం నేను లీవులో వున్నాను. అతనే నా ఆస్పత్రికూడా చూస్తున్నాడు. అతనికి తెలుస్తుంది మీ ట్రబుల్"

సుందర్రావు మాట్లాడకుండా మళ్ళీ గోడ ప్రణయం మొదలు పెట్టాడు.

నేను ఆస్పత్రికి ఫోన్ చేశాను. "రెడ్డిగారు లేరండీ. రైల్వేస్టేషన్‌కి వెళ్ళారు. ఏమైనా చెప్పాలా?" అంది ఫోనందుకున్న నర్సు ఉషా రంగనాధం.

"చాలా చెప్పాలి సిస్టర్. నువ్వు చెప్పలేవు అదంతా. అంచేత రెడ్డిగారు రాగానే ఇక్కడికి రమ్మని చెప్పు" అని వివరాలు కొంత చెప్పి "నీ ఒళ్ళెలా వుంది?" అన్నాను. అది మా ఆస్పత్రి సర్కిల్స్‌లో ఓ జోక్. "ఉషా రంగనాధం మంచి నర్సు. ఒళ్ళుదాచుకోకుండా పని చేస్తుంది" అని! రోగులకి కొందరికి చేతుల్తోనూ, మరికొందరికి మరో విధంగానూ చాలా సేవ చేస్తుంది ఆమె. రంగనాధం అనే మనిషి ఎవడూ లేడు, ఉషకి భర్త. కేవలం రెస్పెక్టబిలిటీ కోసం ఉషా రంగనాధం అని పిలిపించుకుంటుంది.

"నా ఒళ్ళా? మీ కెందుకు? పెళ్ళాల్ని ప్రేమించే మనుషులు! ధూ!" అని లైట్‌గా కోపం ప్రదర్శించింది.

"అబ్బే డాక్టర్‌గా అడుగుతున్నాను"

"పొండి, మీరూ మీ జోకులూను. సుఖం వేరు, సుఖరోగాలు వేరూను! అయినా ఆ రోగాలకి మీరేమీ సాయం చేయక్కర్లేదు. నాకే తెలుసు" అంది ఉషా రంగనాధం. ఆస్పత్రిలో

చాలా బుద్ధిగా పనిచేస్తుంది. ఆమె అంచేత నాకేమీ సమస్య కాలేదు. ఆమె ప్రైవేట్ లైఫ్ ఎలా ఉంటే నాకేం. నేనామెకి గార్డియన్ కాదుగా.

"కోప్పడకు సిస్టర్. ఆస్పత్రి తిన్నగా రెండు కాళ్ళతోనూ నడుస్తోందా?"

"రెండేం ఖర్మ. నాలుగు కాళ్ళతో నడుస్తోంది. మీ వెకేషన్ ఎలా వుంది? రెస్టు ఎక్కువైతే అజీర్ణం చేస్తుందిట."

"నిజమేనమ్మా.....సరేకాని రెడ్డిగారు రాగానే కార్లోంచి దిగకుండానే ఈ సంగతి చెప్పి ఇక్కడికి పంపించు" అని ఫోన్ పెట్టేశాను. అరగంట తరువాత వచ్చిన వీరారెడ్డికి సుందర్రావుని అప్పగించాను.

* * *

ఓ వారం గడిచింది. సుందర్రావుకి రకరకాల పరీక్షలు జరిపాడు డాక్టర్ రెడ్డి. కాని సమస్య అంతు పట్టడం లేదు.

ఓ సాయంత్రం రెడ్డి దంపతులు మా యింటి కొచ్చారు. నేనూ రెడ్డీ లాన్ లో పేము కుర్చీల్లో కూర్చుని కాక్ టెయిల్స్ తాగుతున్నాం. మా పెళ్ళాలు ఇద్దరూ మాకు కొంచెం దూరంగా పూల మొక్కల మధ్య గడ్డిమీద కూర్చోని ఏవో చర్చించుకుంటున్నారు. ఏమిటని నన్నడక్కండి నాకూ తెలీదు. వాళ్ళు మాకు తాగే స్వేచ్ఛ ఇచ్చారు. కనుక వాళ్ళ వ్యసనాలని మేమూ పట్టించుకోం. వాళ్ళు సినీమాలో, చీరలో, జామ్ తయారీలో, మొగుళ్ళో ఏం మాట్లాడుకుంటున్నారో మేం కూపీ తీయంగా.

రెడ్డి ఎంతమంచి డాక్టరో అంత మంచి మనిషి. అందుకే నా విశ్రాంతిని చెడ గొట్టడం ఇష్టం లేక అలవాటుగా కూడా ఆస్పత్రి పేరెత్తడం లేదు. నేనే అడిగాను సుందర్రావు గురించి.

"ఏం చెప్పను శంకర్? అతని నెర్వస్ సిస్టం ఎందుకో చాలా చెడిపోయి వుంది. అతను చూస్తే అన్నీ గుడ్ హేబిట్స్. సినీమాలు, సిగరెట్లు, మందు, ఆఖరికి కాఫీ కూడా అలవాటు లేదు. మంచి భక్తుడు. తను కృష్ణుడి మీద రాసిన పద్యాలు నాకు వినిపించాడు కూడాను. నీలా నాకు కవిత్వం తెలీదనుకో. కాని బాగా రాశాడు, పిచ్చభక్తి."

"ఇంకా కళ్ళు పోతున్నాయా రోజూ."

"రెగ్యులర్! పూటకి ఎట్ లీస్ట్ ఓసారి!........ సర్జరీ ట్రై చేద్దామనుకుంటున్నాను."

కళ్ళ ఆపరేషన్లు చాలా బాగా చేస్తాడు రెడ్డి. నేను మాట మార్చేశాను.

* * *

ఆ తర్వాత రెండ్రోజులకి కాబోలు రాజేంద్రజీ వచ్చారు మా వూరు. రాజేంద్రజీ మొదట డాక్టరే. కాని మనిషికి శరీరం ఒక అంగమే తప్ప శరీరమే మనిషి కాదని అనుకుని, ఆయన; ఫిలాసఫీ, సైకాలజీ, బయోమెట్రీ, యోగపద్ధతులు అధ్యయనం చేయసాగారు. ఆయన్ని నేను బెంగుళూరులో తాతా ఇన్‌స్టిట్యూట్ లో నాలుగేళ్ళ క్రితం కలిశాను. ఆయన్తో మాట్లాడ్డమే ఓ ఎడ్యుకేషన్. తరువాత రెండుసార్లు మెడికల్ కాన్ఫరెన్సుల్లో కలుసుకున్నాను. మాకు ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతూనే ఉన్నాయి. ఆయనిప్పుడు యూనివర్శిటీ నుంచి

ప్రత్యేకాహ్వానం వస్తే రెండు రోజులు లెక్చర్లు ఇవ్వటానికి వచ్చారు. నేను సెలవులో వుండగా ఆయన రావడం నా అదృష్టం.

రాజేంద్రజీ యూనివర్శిటీ గెస్టుహౌసులో దిగిన క్షణం నుంచీ ఆయన తోటే తిరుగుతున్నాను నేను. ఆయన పండితుడే గాక. సరదా మనిషి కూడానేమో నాకు పండుగలా వుంది. "నువ్వు నా నీడలా తయారయ్యావు శంకర్. నీ కంపెనీ నాకూ ఎంతో హాయిగా వుంది. పై ఊళ్ళకి వెళ్ళడం ఎంత అలవాటున్నా పరాయిచోటు అనే ఇబ్బంది నాక్కూడా ఉంటుంది కొంచెం. నీ మూలంగా ఆ లోపం పోయిందిక్కడ." అన్నాడాయన, ఆఖరి లెక్చర్ అయిపోయాకా. గెస్టు హౌస్‌కి వస్తుంటే.

"ఇందులో నా స్వార్థం ఉంది లెండి, నేనేమీ మీరనుకున్నంత-"

"ఏమిటేమిటి? స్వార్థం తప్పు అనా! భలేవాడివే డాక్టర్ స్వార్థం లేకపోతే నేనెవ్వరు? నువ్వెవరు? స్వార్థం లేనిది ఇదిగో ఈ గోడ!" అన్నాడ రాజేంద్రజీ. గోడ అనగానే నాకు సంద్రావు గుర్తొచ్చాడు.

రాజేంద్రజీ స్నానం చేసి ఈవెనింగ్ డ్రెస్ వేసుకొచ్చాకా సుంద్రావు వృత్తాంతం చెప్పాను. రాజేంద్రజీ శ్రద్ధగా విని, "చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. నిజానికి ప్రతీరోగమూ అంతే. మనం కుదిర్చేస్తూ ఉంటాం అదేమీ తెలీకుండానే. ఎందుకంటే మనిషిలో ఎంత గజిబిజి ఉందో మందులోనూ అంతే వుంది. ఎందుకో మనం ఏం తెలీకుండా మందులిచ్చినా అవి పనిచేస్తూ ఉంటాయి. ఎటొచ్చీ ఇక్కడ (సుంద్రావు వ్యవహారంలో) ఈ రహస్యం బయట పడింది. అతన్ని నేను చూడటం వీలవుతుందా?" అన్నాడు. గొప్ప వాళ్ళకి వినయం ఉండి తీరుతుంది కాబోలు. నేను సుంద్రావుని అక్కడికి తీసుకువస్తానని చెప్తే రాజేంద్రజీ అది తనకి పెద్ద ఉపకారం అన్నట్లు మాట్లాడాడు. నేను వెంటనే డ్రైవర్ని పిలిచి సుందరావ్రు ఇంటికి కారు పంపాను. అరగంటలో ఇద్దరూ వచ్చారు.

రాజేంద్రజీ సుంద్రావుని కూర్చోపెట్టి కుశల ప్రశ్నలు వేశాడు. అతని కళ్ళ గురించి ఆయన అడగలేదు. సుంద్రావూ చెప్పలేదు! ఇద్దరూ పోటీలుపడి భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, రాజనీతి, మనుధర్మశాస్త్రం, భాగవతం, కృష్ణలీలలు వగైరాలు చెడామడా చర్చించారు. నాకు మతిపోతోంది చూస్తుంటే. రాత్రి పదకొండయింది. సుంద్రావులో కొంత ప్రాణం కనిపించడం అదే మొదటిసారి నాకు.

"ఆకలేస్తోంది" అన్నాడు రాజేంద్రజీ, నేను చాలా నొచ్చుకున్నాను ఆయనకి తిండి లేకుండా చేశానని. ఎందుకంటే యూనివర్శిటీ వాళ్ళు పంపిన భోజనం వాళ్ళ చదువుల్లాగే చప్పగా చల్లారి నీళ్ళోడుతోంది. "ఊళ్ళోకి పోదాం పదండి బీచ్‌లో "సనెన్‌సీ" ఉంది" అన్నాను. "మరిహనేం, పద. రోగీ పాలుకోరాడు, డాక్టరూ పాలేయిచ్చాడు. యూ ఆర్ ఏ గుడ్ డాక్టర్, డాక్టర్!" అని వీపు చరిచాడు రాజేంద్రజీ. "ఈ బట్టల్తో రానిస్తారా అక్కడ?"

హోటల్ లాన్స్‌లో అంతా నిశ్శబ్దంగా వుంది. రాజేంద్రజీతో కలిసి జిన్ తాగడం నేను కలలో కూడా ఊహించలేని గౌరవం. అందుకే మొదటి డోస్‌తోనే నిషా వచ్చేసింది నాకు.

ఆయన మాత్రం కాలేజీలో పాఠం చెప్తున్న అనాటమీ ప్రొఫెసర్‌లా చాలా గంభీరంగా మెళుకువగా ఉన్నాడు. నాకు జీవితం గురించి చాలా తెలిసింది ఆ మూడు గంటల్లోనూ.

"మనం పేషెంట్‌ని ఏఫోనో పాడైతే రిపేర్ చేసినట్టు ట్రీట్ చేస్తున్నాం, శంకర్! మనిషికి శరీరం ఉంది. మనస్సు కూడా వుంది. ఫ్రాయిడ్ వచ్చి చెప్పిన పాతికేళ్ళదాకా ఆ సంగతి మనం అసలు చెవిని పెట్టలేదు. రోగం ఎవరికి వస్తోంది? మనిషికి! శరీరంలో రోగ లక్షణాలే వుంటాయి. రోగం మాత్రం శరీరానిది మాత్రమే కాదు. అర్థం అయిందా?"

"అయినట్లే వుంది."

"నువ్వు పేషంట్‌కి ఏవేవో టెస్ట్‌లు చేస్తావు కదూ. వాడేం తింటున్నాడో రోజంతా ఏం చేస్తున్నాడో- దేన్ని ప్రేమిస్తో, దేన్ని ద్వేషిస్తో, దేన్ని వెదుకుతూ, దేన్ని తప్పించుకుంటూ వుంటాడో- ఎప్పుడేనా కనుక్కున్నావా?"

"లేదు. అదెలా కుదురుతుంది?"

"కుదరదూ? అయితే రోగమూ కుదరదు!"

"బోలెడు మందికి కుదురుతుంది."

"నీ మొహం...." గుప్ గుప్‌న కోపంగా పైప్ పీల్చాడు రాజేంద్రజీ. "సైకాలజీ అని పెద్ద పేరు పెట్టారు. కాని అందరూ ప్రతీ క్షణం దాంటోనే కదా రిసెర్చి చేస్తున్నాం. మన మనస్సులో కోరికలు తీరితే బాగుంటుంది. ఉషారుగా ఉంటుంది. బలంగా ఉంటుంది. తీరక పోతే బాధ వస్తుంది. నీరసం వస్తుంది. రోగం వస్తుంది... మనం మెళుకువగా ఉన్నంత సేపూ ఇదంతా అనుభవిస్తూనే ఉన్నాం కాని పట్టించుకోం" నేను వింటున్నాను.

"సుందర్రావుకి సెక్స్ భయం"

"మా ఆవిడ కూడా అదే అంది"

"అందా! గుడ్‌గర్ల్!"

మీ ఆవిడ తెలివైంది కావచ్చు. కాని ఇది తెలీడానికి అంత తెలివేమీ అక్కర్లేదు. మనిషి సహజంగా బ్రతకాలి. గోడల్తో మాట్లాడ్డం- అదీ పనిగట్టుకుని డాక్టరింటికి వచ్చి చేయడం - సహజం కాదు. అదీ అసలు రోగం. కళ్ళు తెరిచి ఉండగా కృష్ణుణ్ణి చూడ్డం చాలా స్ట్రెయిన్. కళ్ళతో ఎదట ఉన్నవాళ్ళని చూడాలి. అందుకూ దేవుడు కళ్ళిచ్చాడు మనకి. కళ్ళ ఎదుట లేని దాన్ని చూడ్డం చాలా కృత్రిమం. దేవుడి పేరుతో చేసినా తప్పు తప్పే."

"ఎప్పుడూ చూడని మనిషిని ఊహించడం మాత్రం ఎలా కుదురుతుంది? ఓసారి కృష్ణుణ్ణి కళ్ళతో చూసి వుంటేనే ఆయన రూపం గుర్తు రావడం లేదు. అలా కాకుండా ఎప్పుడూ చూడని కృష్ణలీలల్ని ఊహించడం రోగం అవుతుంది. అదే సుందర్రావు రోగం"

"ఏం చేయాలి అతనికి? సైకోథెరపీ అంత బాగా డెవలప్ అవలేదుగా ఇక్కడ?" అన్నాను.

"నేనున్నానుగా. నాకు సైకియాట్రీ డిప్లమో వుంది కనుక నాటు వైద్యం అని కూడా అనక్కర్లేదు అన్నాడు రాజేంద్రజీ. నాకు కుతూహలంతో గుండెలు దడదడా కొట్టుకున్నాయి.

గొప్ప ఎడ్వెంచర్ ఏదో జరగబోతోంది నా కళ్ళెదుట.

సుందర్రావుని వెంటనే మా ఆస్పత్రిలో ఎడ్మిట్ చేయమన్నాడు రాజేంద్రజీ. ఆయన బస మాయింటికి మార్చేశాం.

* * *

ఆ మర్నాడు రాజేంద్రజీని మా ఆస్పత్రికి తీసుకెళ్ళాను. "బాగుందోయి! ఆశ్చర్యం! ఆస్పత్రి అయినా ఎంతో నీట్‌గా కూడా వుంది. అదే ప్రభుత్వ ఆస్పత్రి అయితే బాత్ రూంలూ యింత పొడిగా వుండవు. అది ప్రజల సొమ్ము కనుక వాళ్ళు స్నానం చేసిన నీళ్ళూ, వాళ్ళు విడిచిన ద్రవాలు భద్రంగా స్నానాల గదుల్లోనే వుంచుతారు. అక్కడయితే నేలమీద నిలువనీరు లేకపోటాన మీ వార్డులూ, బాత్ రూంలూ బోసిగా ఉన్నాయి ఎక్కడా ఉమ్ములూ, ఎంగి లాకులూ కనపట్టం లేదు...." అని జోకులు వేస్తూ అన్ని గదులూ పరిశీలించాడు రాజేంద్రజీ. మేం ఏ గదిలోకి వెళ్ళినా ముందే అక్కడకు చేరిన ఉషా రంగనాథం కనిపిస్తోంది. రాజేంద్రజీ చాలా గొప్ప డాక్టరనీ, పేరున్న వాడనీ ఆయనకి కనపడేలా అల్లరి చేయవద్దనీ నేను ముందే వార్నింగ్ యిచ్చాను ఆమెకి. అంచేత బుద్ధిగా వున్నట్లు నటిస్తోంది. కాని పుట్టినప్పట్నించీ వున్న అలవాటు పోతుందా. చాలా పెద్ద మనిషి తరహాగా ముదురు నీలిరంగు పట్టుచీర, తగ్గ రంగు జాకెట్ ధరించింది. నున్నగా తల దువ్వుకుని జడ వేసుకుంది హైహీల్డుకి బదులు సాదా చెప్పులు, ముఖాన పెద్ద కుంకం బొట్టు పెట్టుకుంది. అయినా నడుస్తుంటే డాన్స్‌లాగే వుంది. ఎంత అణుచుకున్నా ఆగని ముసిముసినవ్వులూ ఇకిలింతలు వస్తునే వున్నాయి.

"ఎవరీ పిల్ల?" అన్నాడు రాజేంద్రజీ.

"మా నర్సుల్లో ఒకరు. ఉషారంగనాథం. చాలా మంచి నర్సు చచ్చేలా పనిచేస్తుంది. ఒళ్ళు దాచుకోదు."

"కనిపిస్తూనే వుంది....." అని ఓ నిమిషం ఆలోచించి "సుందర్రావు ట్రీట్‌మెంట్‌కి ఈ పిల్ల అవసరం రావచ్చు. మనం చెప్పినట్లు వింటుందా?"

"చెప్పకుండానే వింటుంది." వివరించి చెప్పాను.

మరో అయిదు నిమిషాల్లో సుందర్రావు సపరివారంగా వచ్చాడు ఆస్పత్రిలో చేరడానికి. సుందర్రావు భార్య లక్ష్మిని చూస్తే నాకు జాలితో గుండె మెలి తిరిగిపోయింది. అందంగా పుష్టిగా వుంది: కాని కళ్ళలో గడ్డకట్టుకునివున్న దిగులుని చూస్తే నాకు ఏడు పొచ్చినంత పనైంది. ఆమెని చూసి రాజేంద్రజీ నా చెవిలో "చూశావా, మీ పేషంట్ ఎలాంటివాడో ఆమెని చూస్తే తెలీటంలా?" అన్నాడు. తెలిసిందన్నాను. సుందర్రావు పెళ్ళయి నప్పట్నించీ పెళ్ళాన్ని తల్లిగా చూస్తూ బ్రహ్మచర్యం పాటిస్తున్నాడని నాకు రెడ్డిద్వారా మొన్నే తెలిసింది. మధుర భక్తికి పెళ్ళాం అడ్డు కాబోలు.

సుందర్రావు ఒక్కడికీ ఓ రూం ఇమ్మన్నాడు రాజేంద్రజీ. తర్వాత ఉషా రంగనాథాన్ని పక్కకి పిలిచి తగ్గుస్థాయిలో ఏవో చాలా చెప్పాడు. ఆమె అదేపనిగా నవ్వుకోడం. ఆమె కళ్ళు

హాస్యంతో మెరవడం, ఒళ్ళు, తల, మెలికలు తిరిగి పోతూ డాన్స్ చేయడం నా కంటపడుతోంది. ఆమెకు బాగా నచ్చిన పని ఏదో తగిలిందన్న మాట.

కాని సుందర్రావు ట్రీట్‌మెంట్‌ని కళ్ళారా చూసే భాగ్యం నాకు లేకపోయింది. ఎందుకంటే నా లీవు ఇంకా నాలుగు రోజులుంది. ఈలోగా ఆస్పత్రి వేపు వెళ్తే నా కాళ్ళకి రోలు కట్టేస్తానని బెదిరించింది మా ఆవిడ.

అంచేత మధ్య మధ్య ఇంటికొచ్చి రిపోర్టులు ఇస్తూ ఉండమని ఉషా రంగనాధాన్ని బ్రతిమాలాను. "అలాగే బాస్! కాని దానికి కొంత ఖర్చవుతుంది." ఒక్కొక్క విజిట్‌కి అయిదు రూపాయలు రేటు పెట్టేసింది. ఒప్పుకున్నాను.

సుందర్రావు కళ్ళజబ్బు మామూలుది కాదు. ఆ పంచరంగుల రోగం అతనికి ఉన్నట్లుండి కళ్ళ ముందర ఏదో రంగులు కనిపిస్తాయిట అవి గిరగిరా తిరుగుతాయిట. ఆ తర్వాత కొంతసేపటి దాకా చూపు అస్సలు ఉండదుట. ఉష చెప్పింది.

"నువ్వేం చేశావు?"

"ఏం చేస్తాను? నర్సు ఏం చేస్తుంది? పంచరంగుల కలలొస్తున్నాయి- అన్నాడతను. ఏ రంగు, ఈ రంగు ఉందా అని అతని మీదకి వంగి నా పైట పక్కకి తీసి నా జాకెట్ చూపించాను. అలా చూస్తూ ఉండిపోయాడు."

"ఎంత సిగ్గుమాలిన పని చేశావు మిసెస్ రంగనాధం!" తెచ్చి పెట్టుకున్న కోపంతో అన్నాను డాక్టరుగా నా విధి ప్రకారం.

"అతనికి లేని సిగ్గు మీ కెందుకు? నా జాకెట్ మామూలుదే కదా. అయినా అతను అలా చూస్తూనే వున్నాడు. గంటసేపూ!"

"ఇంకేం చేశావు?"

"అవన్నీ చెపితే నా వీపు పగలగొట్టనని మీ ఆవిడ చేత కాగితం రాయించుకురండి"

"ఫరవాలేదు."

"మీ ఆవిడ ఒక వేళ కనికరించి ఒప్పుకున్నా నేను ఇంతకు మించి చెప్పను. ప్రొఫెషనల్ ఎథిక్స్! వృత్తి రహస్యాన్ని బయట పెట్టకూడదు."

"గొప్ప రహస్యాలే. నర్సుల రహస్యాలు డాక్టర్లకి కొత్తా! తల్లి పుట్టిల్లు మేనమామకి తెలీదన్నట్లు! అంతేనా, మరేదయినా ప్రొఫెషన్ తాలూకు రహస్యాలా?"

"నే న్చెప్పను. అంతే" అని నవ్వుకుని, "అదికాదు బాస్! మొగుడు ఇలా పాడై పోతుంటే, ఆయన పెళ్లాం చేతికి గాజులు తొడుక్కుని కూర్చుంది, ఏం చేయకుండా. ఎంత రాతిగుండె ఆవిడది!" అంది ఉషా రంగనాధం.

మరో మూడు రోజుల్లో సుందర్రావు థాంక్స్ చెప్పడానికి వచ్చాడు. మనిషిలో ఎంత ఉషారు? ఎంత సంతోషం! సిగ్గు పడుతూనే అంతా చెప్పేశాడు నాకు.

సుందర్రావు చిన్నప్పట్నించీ అంతేట! కృష్ణుడూ, గోపికలూ, బృందావనం నిత్యం ఊహించుకుంటూ ఉండేవాడుట - పెళ్ళయ్యేనాటికి సాధన బాగా అయిందట. తలనొప్పి,

నీరసం, మరో క్షణంలో కపాల మోక్షం అయ్యేలా వున్నా ఏదో ఆనందంగా ఉండేదిట.

పెళ్ళయ్యాక పెళ్ళాన్ని కన్విన్స్ చేసి బ్రహ్మచర్యం కొనసాగించాడుట. కాని నీరసం ఇంకా పెరిగిపోయింది. కళ్ళముందు రంగులు గిరగిరా తిరగడం మొదలయి రెండేళ్ళయింది. కళ్ళు పూర్తిగా కనబడకపోవడం మొదలై నెల అయింది.

నీరసం వస్తే అదంతా సత్వగుణం అనుకున్నాడుట. పెళ్ళానికి ఫిట్స్ వస్తున్నాయట!

"ఫరవాలేదు డాక్టర్. నా రోగమే నా పెళ్ళాం రోగానికి కారణం. నాకు తగ్గిందిగా, దానికీ పోతుంది. రాజేంద్రజీ వచ్చి ఉండకపోతే ఈ పాటికి ఏమయ్యే వాణ్ణో....." అంటూ ఆయన్నీ, నన్నూ, రెడ్డినీ. అరగంట పొగిడాడు సుందర్రావు. ఉషారంగనాథం పేరు ఒక్కసారి కూడా అతను ప్రస్తావించలేదు. కాని ఈ విప్లవం సాధించిన అజ్ఞాత యోధ (గి)ని ఉషారంగనాథం కదా; మాట వరసకేనా ఆమెను థాంక్ చేయలేదు సుందర్రావు.

వెళ్ళేటప్పుడు సుందర్రావు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "దైవం మనుష్య రూపేణాం అంటే ఏమిటో అనుకునే వాణ్ని డాక్టరు గారూ! దేవుడు నేరుగా ఎవరికీ కనపడడనీ, మనుష్యులోనూ, అన్ని వస్తువుల్లోనూ దాగి ఉంటాడనీ నాకు మీ ఆస్పత్రిలో అనుభవమైంది! కాని బదులుగా నేనేం చేయగలను. మీ ఫీజు-"

"వాయిదాల పద్ధతిని ఇవ్వండి! ఇప్పుడది వర్రీఅవద్దు. ఇంటికి వెళ్లండి" అన్నాను నా పాదాలమీద వాలకుండా అతన్ని ఆపి.

* * *

నెల్లాళ్ళ తర్వాత అనుకుంటాను, ఉషారంగనాథం చేతిమీద ఓ కొత్త లేటెస్టు ఫాషన్ చెయినుతో ఉన్న వాచీ కనబడింది. "ఎంత?" అన్నాను మెచ్చుకుంటూ.

ఉష చెప్పలేదు. కళ్లు పెద్దవి చేసి చూపిస్తూ "అంత. అయినా మీకెందుకూ! అది నా ప్రొఫెషనల్ సీక్రెట్!" అంది.

(ప్రభవ, మాసపత్రిక)

★